RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana



# ఘనంగా భారతీయ మజ్దూర్ సంఘ్ 72వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**మొగిలిపాక ఆధ్వర్యంలో రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌లో బీఎంఎస్ జెండా ఆవిష్కరణ**



కొత్తగూడెం సింగరేణి, జూలై 23 (తెలంగాణ వాణి)
భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) 72వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌లో యూనియన్ వైస్ ప్రెసిడెంట్ మొగిలిపాక రవి ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. పిట్ సెక్రటరీ శ్రీనివాస్ సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొగిలిపాక రవి బీఎంఎస్ జెండాను ఆవిష్కరించి, అనంతరం మాట్లాడారు. భారతీయ మజ్దూర్ సంఘ్ స్థాపన ఆశయాలు, కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం సంఘం చేపడుతున్న కార్యక్రమాలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ జి.వి. కృష్ణారెడ్డి, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.ఎస్. పవన్ కుమార్, కార్పొరేట్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ భానోత్ రామ్ సింగ్, కొత్తగూడెం రీజినల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, బీఎంఎస్ సోషల్ మీడియా కన్వీనర్ కోల హరీష్, కొత్తగూడెం ఏరియా కాంట్రాక్ట్ కార్మికుల సంఘం ఉపాధ్యక్షుడు రఘు తదితరులు పాల్గొని బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సామాజిక అభివృద్ధి కోసం భారతీయ మజ్దూర్ సంఘ్ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.

# యువత మీద కేసులు పెట్టొద్దు

**కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి**

**జిల్లా న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి మహేష్ గడిపెల్లి**



కొత్తగూడెం, జులై 23 (తెలంగాణ వాణి)
నీట్ పరీక్ష పత్రం లీకేజీ ఘటనకు పూర్తి బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని,విద్యార్థులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని కొత్తగూడెం జిల్లా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడిపెల్లి మహేశ్ డిమాండ్ చేశారు. ఢిల్లీలో నీట్ విద్యార్థుల పై పోలీస్ చర్యను ఖండిస్తూ న్యాయవాదులు గురువారం సంఘ కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు కిరణ్ కుమార్ అధ్యక్షతన సర్వసభ్యసమావేశం నిర్వహించారు... ఈ సమావేశంలో సభ్యులు ముక్తకంఠంతో ఢిల్లీ పోలీసుల చర్యను ఖండిస్తూ నల్ల బ్యాడ్జిలతో పోస్టాఫీసు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలపాలని సమావేశంలో తీర్మానించారు. అనంతరం ర్యాలీగా పోస్టాఫీసు అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొని నిరసన తెలియజేసారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి మహేష్ గడి పెల్లి... మాట్లాడుతు ఢిల్లీలో నీట్ విద్యార్థుల పై పోలీస్ చర్యను ఖండిచారు. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీకి నిరసనగా శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల లాఠీ చార్జ్ దారుణమన్నారు. నిరసన తెలియజేయడం రాజ్యాంగం ఇచ్చిన హక్కు అని,ఈ దేశ యువతకు విద్య, ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ప్రభుత్వం బాధ్యతను విస్మరించినప్పుడు ఇలాంటి ఉద్యమాలే జరుగుతాయని,నిరసన తెలుపుతున్న విద్యార్థులకు దేశ నలుమూలల నుంచి ఆహార పదార్థాలను పంపి దేశ ప్రజలు వారి నిరసనకు మద్దతు తెలియజేశారని ప్రభుత్వం గమనించి వారి డిమాండ్లను నెరవేర్చాలని, కేంద్రం ఒకవైపు సమస్యలు పరిష్కరిస్తామని ప్రకటిస్తూనే మరోవైపు పోలీసులను ఉసిగొల్పడం సరైన విధానం కాదన్నారు. ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయదాదులు శివరామ్ ప్రసాద్,రమేష్ కుమార్ మక్కడ్,కె.పుల్లయ్య,కోటం రాజు,ఉపేందర్,జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ తదితరులు పాల్గొన్నారుడిమాండ్ చేసారు.

# ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం : ఎస్ కె సాబీర్ పాషా

**ఓటు హక్కుపై సిపిఐ విస్తృత ప్రచారం**

**ఎస్ఐఆర్ ప్రక్రియపై గడపగడపకూ అవగాహన**

కొత్తగూడెం, జులై 23 (తెలంగాణ వాణి)




ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో విస్తృత ప్రచార కార్యక్రమం చేపట్టినట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా తెలిపారు. కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ప్రధాన బస్తీలు, గ్రామాల్లో ఐదు ప్రచార ఆటోల ద్వారా ఈ మైకు ప్రచారాన్ని రెండో రోజైన గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, ఓటర్ల నమోదు ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తులో హక్కును కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఎన్యుమరేషన్ ఫారాలను సరైన వివరాలతో నింపి తిరిగి ఎన్నికల అధికారులకు అందించే బాధ్యతను ప్రతి పౌరుడు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఫారాలను సరిగా సమర్పించకుంటే ఎదురయ్యే నష్టాలను, ప్రక్రియ షెడ్యూల్ విశేషాలను మైకుల ద్వారా వీధి వీధినా ప్రజలకు వివరిస్తున్నట్లు తెలిపారు. ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యంగా పార్టీ పనిచేస్తుం దన్నారు. స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రాతినిధ్యంలో నియోజకవర్గం లో అన్ని రంగాల్లోనూ శీఘ్రగతిన అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్లు, డ్రెయిన్లు, వంతెనల నిర్మాణం, సంక్షేమ పథకాలు, నిధుల సేకరణ ద్వారా నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి జరుగుతోందన్నారు. అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలంటే ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యం, ఓటు హక్కు నమోదు అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియ పూర్తయ్యే వరకు నియోజకవర్గ వ్యాప్తంగా తమ పార్టీ ప్రచారాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# కార్పొరేషన్ అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలి

**అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులుకు నిధులు కేటాయించండి**

**రోడ్ల విస్తరణ, మౌలిక వసతుల కల్పనలు నిధులు విడుదల చేయండి**

**ఉప ముఖ్యమంత్రి భట్టికి వినతిపత్రం**

**అందించిన కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్**

కొత్తగూడెం, జులై 23 (తెలంగాణ వాణి)
కార్పొరేషన్ అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లుకు గురువారం కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొత్తగూడెం పర్యటనకు వచ్చిన సందర్భంగా మేయర్ ఆయనను కలిశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటైన కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. నగరవ్యాప్తంగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యుజిడి) వ్యవస్థ నిర్మాణానికి అవసరమైన నిధులను



మంజూరు చేయాలని కోరారు. పట్టణంలో పెరిగిన రవాణా అవసరాలకు అనుగుణంగా రోడ్ల విస్తరణతో పాటు రోడ్డు మౌలిక వసతుల అభివృద్ధికి ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి పనుల ద్వారానే నగర ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయని తెలిపారు. కార్పొరేషన్ ఆరంభ దశలో ఉన్నందున ప్రత్యేక దృష్టి సారించి నిధుల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. మేయర్ అందించిన వినతిపత్రంపై ఉపముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని, పనుల నిర్వహణకు తగిన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారని వెల్లడించారు. మేయర్ వెంట సిపిఐ నాయకులు కార్పొరేటర్లు ఎండియూసు బోయిన విజయకుమార్, గుర్రం వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు

# కీలక ఖనిజాల అన్వేషణలో సింగరేణి కొత్త అడుగు

**కొత్తగూడెంలో 13 కోట్లతో అత్యాధునిక జియో-సైన్స్ ల్యాబొరేటరీ ఏర్పాటు**

**ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి**



కొత్తగూడెం సింగరేణి, జులై 23 (తెలంగాణ వాణి)
భారత ప్రభుత్వ గనుల మంత్రిత్వ శాఖ, బొగ్గు మంత్రిత్వ శాఖ సంయుక్తంగా అమలు చేస్తున్న జాతీయ కీలక ఖనిజాల మిషన్‌లో భాగంగా సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కొత్తగూడెంలో అత్యాధునిక జియో-సైన్స్ ల్యాబొరేటరీని ఏర్పాటు చేసింది. సింగరేణి సంస్థలో భూగర్భ శాస్త్ర పరిశోధనలు, ఖనిజాల విశ్లేషణను మరింత ఆధునీకీకరించే లక్ష్యంతో కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలో ఏర్పాటు చేసిన అత్యాధునిక జియో సైన్స్ లేబరేటరీని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క మల్లు గురువారం ప్రారంభించారు. జిల్లా పర్యటనలో భాగంగా కొత్తగూడెంకు విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జియో సైన్స్ లేబరేటరీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రారంభోత్సవం



అనంతరం లేబరేటరీలో ఏర్పాటు చేసిన అత్యాధునిక యంత్ర పరికరాలు, ఖనిజాల విశ్లేషణ, బొగ్గు నాణ్యత నిర్ధారణ, భూగర్భ శాస్త్ర పరిశోధనలకు వినియోగిస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉప ముఖ్యమంత్రి పరిశీలించారు. లేబరేటరీలో అందుబాటులో ఉన్న పరీక్షా విధానాలు, విశ్లేషణ సామర్థ్యం, పరిశోధనల ప్రాముఖ్యతపై సింగరేణి అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. ఈ జియో సైన్స్ లేబరేటరీ ద్వారా ఖనిజాల నమూనాల విశ్లేషణ, బొగ్గు నాణ్యత నిర్ధారణ, భూగర్భ శాస్త్ర పరిశోధనలు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మరింత వేగవంతంగా, కచ్చితత్వంతో నిర్వహించేందుకు అవకాశం కలుగుతుందని అధికారులు తెలిపారు. దీంతో సింగరేణి సంస్థలో శాస్త్రీయ పరిశోధనలకు మరింత ప్రోత్సాహం లభించడంతో పాటు ఆధునిక గనుల నిర్వహణకు అవసరమైన సాంకేతిక సేవలు మరింత మెరుగుపడనున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైరా శాసనసభ్యులు రాందాస్ నాయక్, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రోహిత్ రాజు, సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బుద్ధ ప్రకాశ్ జ్యోతి, ఐఏఎస్, సింగరేణి డైరెక్టర్ (పర్సనల్, అడ్మినిస్ట్రేషన్ అండ్ వెల్ఫేర్) గౌతమ్ పొట్రూ, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్, సింగరేణి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారత కోసం అహర్నిశలు కృషి చేయాలి





**జిల్లా సంక్షేమ అధికారిని స్వర్ణలత లెనీనా**

**మహిళలకు కుట్టు మిషన్లు, బాలికలకు సైకిళ్ళ పంపిణీ**

పాల్వంచ, జులై 23 (తెలంగాణ వాణి)
పాల్వంచ పట్టణంలోని 42వ డివిజన్లో విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ, మహిళలకు టైలరింగ్ యూనిట్లను జిల్లా సంక్షేమ అధికారిని స్వర్ణలత లేనినా ప్రారంభించడం జరిగింది. డివిజన్ పరిధిలో పాఠశాలలకు వెళ్లడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాలికల కోసం సైకిళ్ల పంపిణీ, అలాగే మహిళల ఆర్థిక స్వావలంబన కోసం టైలరింగ్ యూనిట్ల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని స్థానిక ప్రజలతో కలిసి ఘనంగా నిర్వహించారు. బాలికల విద్యను ప్రోత్సహించడం, మహిళా సాధికారతను పెంపొందించడమే లక్ష్యంగా ప్రత్యేక పని చేయాలని మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని, అన్ని శాఖల సమన్వయంతో మునుముందు ఇలాంటి కార్యక్రమాలు ఎన్నో చేపడతామని, మహిళా సాధికారికత కేంద్రం అన్ని వేళలో క్షేత్రస్థాయిలో ఉన్న మహిళలకి వారి ఆర్థిక పురోగతి పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి క్షేత్రస్థాయిలో మహిళలకు మనో ధైర్యం కల్పించాలని, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పలు కార్యక్రమాలపై కూడా మరింత అవగాహన కల్పించాలని జిల్లా సంక్షేమ అధికారి జే స్వర్ణలత లేనినా కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ డి. మణి, మహిళా సాధికారిత కోఆర్డినేటర్ సంతోష రూప మరియు సిబ్బంది సౌజన్య, జహీదా, డివిజన్ నాయకులు, స్థానిక మహిళలు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో నాకాబందీ

**3,714 వాహనాల తనిఖీ**

**764 స్పాట్ చలానాలు1,567 వాహనాలపై జరిమానాలు**

**చోరీ ద్విచక్ర వాహనం స్వాధీనం**



కొత్తగూడెం, జులై 23 (తెలంగాణ వాణి)
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల అరికట్టడం, రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా జిల్లా పోలీసులు గురువారం ఉదయం విస్తృత స్థాయిలో ప్రత్యేక నాకాబందీ నిర్వహించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఒకేసారి చేపట్టిన ఈ తనిఖీల్లో వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు, ఫింగర్ ప్రింట్ డివైస్ ద్వారా పాత నేరస్తుల గుర్తింపు వంటి చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించిన ఈ ప్రత్యేక నాకాబందీలో మొత్తం 3,714 వాహనాలను తనిఖీ చేశారు. వీటిలో 2,384 ద్విచక్ర వాహనాలు, 987 నాలుగు చక్రాల వాహనాలు, 434 లారీలు ఉన్నాయి. తనిఖీల్లో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 510 మంది, నంబర్ ప్లేట్ లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా మార్పులు చేసిన 308 వాహనాలు, హెల్మెట్ ధరించని 524 మంది, సీటు బెల్ట్ ధరించని 106 మంది, మైనర్లు నడిపిన 14 వాహనాలు, అక్రమ సైలెన్సర్లు అమర్చిన నాలుగు వాహనాలను గుర్తించారు. అదేవిధంగా ఏడు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయగా, 15 అనుమతి లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో చోరీకి గురైన ఒక ద్విచక్ర వాహనాన్ని గుర్తించి స్వాధీనం చేసుకోవడంతో పాటు మరో ఏడు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 764 స్పాట్ చలానాలు విధించగా, 1,567 వాహనాల నుంచి జరిమానాలు వసూలు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ మాట్లాడుతూ ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్, సీటుబెల్ట్ ధరించాలని, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్‌తోనే వాహనాలు నడపాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని హెచ్చరించారు. జిల్లాలో





నేరాల నియంత్రణ, ప్రజల భద్రత కోసం ఇటువంటి ప్రత్యేక నాకాబందీ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు లేదా అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేసి సహకరించాలని జిల్లా ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

# విజయ విఘ్నేశ్వర ఆలయాన్ని సందర్శించిన దేవాదాయ కమిషనర్

**అర్చకులు, సిబ్బందితో ఆలయ విశిష్టతలపై చర్చ**



కొత్తగూడెం, జులై 23 (తెలంగాణ వాణి)
పట్టణ పరిధిలోని శ్రీ విజయ విఘ్నేశ్వర స్వామివారి దేవస్థానాన్ని గురువారం దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఎం. హనుమంతరావు సందర్శించారు. ఆలయానికి చేరుకున్న కమిషనర్‌కు అర్చకులు, సిబ్బంది ఆలయ సాంప్రదాయం ప్రకారం ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన శ్రీ విజయ విఘ్నేశ్వర స్వామివారితో పాటు శ్రీ స్వర్ణ దుర్గ అమ్మవారు, శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి, శ్రీ ఆంజనేయ స్వామివార్లను దర్శించుకున్నారు. అర్చక స్వాములు వేద ఆశీర్వచనం అందించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించిన అనంతరం ఆలయ విశిష్టత, నిర్వహణ తీరు, భక్తులకు అందిస్తున్న సౌకర్యాల గురించి అర్చకులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎడ్యుకేషనల్ సొసైటీ ఉద్యోగులకు కూడా రూ.1 కోటి ప్రమాద బీమా వర్తింపు

**ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ వెల్లడి**





కొత్తగూడెం సింగరేణి, జులై 23 (తెలంగాణ వాణి)
సింగరేణి సంస్థ పరిధిలోని సింగరేణి ఎడికేషనల్ సొసైటీలో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా కార్పొరేట్ సాలరీ అకౌంట్ ద్వారా అందించే రూ.1 కోటి ప్రమాద బీమా (యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ కవర్) వర్తించేలా సంబంధిత బ్యాంకులు అంగీకరించినట్లు ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేట్ సాలరీ అకౌంట్ కలిగిన ఉద్యోగి ప్రమాదవశాత్తు మరణించిన పక్షంలో సంబంధిత నిబంధనల ప్రకారం అతని కుటుంబానికి రూ.1 కోటి ప్రమాద బీమా ప్రయోజనం అందే విధంగా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ నిర్ణయం సింగరేణి స్కూల్ ఎడికేషనల్ సొసైటీలో ఉద్యోగులకు ఆర్థిక భద్రత కల్పించడంతో పాటు వారి కుటుం బాలకు ఎంతో ఉపశమనం కలిగిస్తుందని తెలిపారు. అదేవిధంగా, సింగరేణి సూపర్ బజార్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా ఇదే తరహా రూ.1 కోటి ప్రమాద బీమా సౌకర్యం వర్తించేలా గుర్తింపు సంఘం ఏఐటీయూసీ యాజమాన్యం మరియు సంబంధిత బ్యాంకులతో చర్చలు జరుపుతూ నిరంతరం కృషి చేస్తోందని వెల్లడించారు. సింగరేణి సంస్థ పరిధిలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగికి సమాన సంక్షేమ సౌకర్యాలు, భద్రతా పరిరక్షణ మరియు ఆర్థిక రక్షణ కల్పించడమే ఏఐటీయూసీ లక్ష్యమని వారు స్పష్టం చేశారు. ఉద్యోగుల హక్కులు, భద్రత మరియు సంక్షేమం కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.

RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
శుక్రవారం । 24 । జూలై । 2026

## కొమురవెల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన సిపి రష్మీ పెరుమాళ్



**కొమురవెల్లి, జులై 23 (తెలంగాణ వాణి)**
సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, ఐపీఎస్ గురువారం రోజున కొమురవెల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా ఆమె పోలీస్ స్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రకాల రికార్డులను, కేస్ డైరీలను సీపీ పరిశీలించారు. రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని అధికారులను ఆదేశించారు. వివిధ కేసుల్లో సీజ్ చేసి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉంచిన వాహనాలను ఆమె పరిశీలించారు. వాటికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో సీపీ మాట్లాడారు. వారి విధులు, పనితీరును అడిగి తెలుసుకోవడంతో పాటు, సిబ్బందికి ఏవైనా వ్యక్తిగత లేదా వృత్తిపరమైన సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణలో సిబ్బంది అంతా అంకితభావంతో పనిచేయాలని, స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తించి వారికి త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని ఈ సందర్భంగా సీపీ రష్మీ పెరుమాళ్ ఆదేశించారు. ఈ తనిఖీలో సిఐ రమేష్, పోలీస్ స్టేషన్ ఎస్ఐ మహేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీని గాయపరిచి, అరెస్టు చేయడం మోడీ నిరంకుశత్వ పాలనకు నిదర్శనం

### డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల 2028లో జరిగే ఎన్నికల్లో భారత ప్రధాని రాహుల్






**పాల్వంచ, జులై 23 (తెలంగాణ వాణి)**
రాహుల్ గాంధీ, పొంగులేటిల అరెస్టును నిరసిస్తూ పాల్వంచలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొత్వాల నాయకత్వంలో భారీ ప్రదర్శన, రాస్తారోకో, నిరసన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని రక్తం కారేలా గాయపరిచి, అక్రమంగా అరెస్టు చేయించడం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోడీ నిరంకుశత్వ పాలనకు నిదర్శనమని డి.సి.ఎం.ఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజాస్వామ్యబద్ధంగా ఢిల్లీలో ఆందోళన చేస్తున్న నీట్ విద్యార్థులను అక్రమంగా లాఠీచార్జ్ జరిపి, అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ అఖిల భారత కాంగ్రెస్ అగ్రనేత, పార్లమెంటు సభ్యులు రాహుల్ గాంధీని, ఏ.ఐ.సి.సి అధ్యక్షులు ఖర్గే, ఎం.పీ ప్రియాంక గాంధీ లను రక్తం వచ్చేలాగా గాయపరచి అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ వారి అక్రమ అరెస్టులను నిరసిస్తూ ఆందోళన చేసిన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పి.సి.సి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నాల ప్రభాకర్, అజారుద్దీన్ లను అరెస్టు చేయడాన్ని ఖండించారు. పాల్వంచలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొత్వాల నాయకత్వంలో భారీ ప్రదర్శన రాస్తారోకో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసినందుకు బాధ్యత వహిస్తూ ప్రధాని మోడీ, కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల పక్షాన అండగా నిలిచి న్యాయం చేయాలని ఆందోళన చేసిన రాహుల్ గాంధీ పై పోలీసులు బల ప్రయోగానికి దిగడం సిగ్గుచేటు అన్నారు. అరెస్టులకు, అక్రమ కేసులకు కాంగ్రెస్ శ్రేణులు భయపడేది లేదని విద్యార్థుల ఆందోళనకు రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని కొత్వాల అన్నారు. 2028 లో జరిగే ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం రాహుల్ గాంధీ ప్రధాని అవ్వడం ఖాయం అని కొత్వాల అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, కార్పొరేటర్లు కాల్వ భాస్కరరావు, డాక్టర్ బి.ఎస్.రావు, కొత్వాల విమలాదేవి, పైడిపల్లి విజయలక్ష్మి, నూకల సరిత, మాలంపాటి భవిత, శరపా శాంత, దంతెబోయిన నరేష్, హోళి శ్రీను, ధర్మసోత్ నరేష్, కాంగ్రెస్ నాయకులు యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న గౌడ్, గంగిరెడ్డి భువన సురేందర్ రెడ్డి, నూకల రంగారావు, గద్దల రమేష్, సాదం రామకృష్ణారావు, మహిపతి రామలింగం, వై.వెంకటేశ్వరరావు, కనగాల నారాయణరావు, ఆచార్యులు,కాపర్తి వెంకటాచారి, బాలినేని నాగేశ్వరరావు, చింతా నాగరాజు, పైడిపల్లి మహేష్, కందుకూరి రాము, దారా చిరంజీవి, పులి సత్యనారాయణ, సోమిశెట్టి భార్గవ్, వాసుమల్ల సుందర్ రా, ఉండేటి శాంతివర్ధన్, కొమ్మరాజు విజయ్, సదాశివ, ధర్మసోత్ ఉపేంద్ర నాయక్, గుర్రం వెంకటరత్నం, కాపా శ్రీను, గంధం నరసింహారావు, మస్నా శ్రీనివాస్ సందు ప్రభాకర్, మాలోత్ కోటి నాయక్, పెంకె శ్రీను, సయ్యద్ కరీం, నరిగె సుజాత, బూసి శ్రీను, యాటా నాని, షేక్ బాషా, బాసబోయిన అశోక్, జమాల్ సైదులు, ఇజ్జగాని రవిగౌడ్, వాలపల్లి రాంబాబు, బర్ల లక్ష్మీదేవి, చింతలచెరువు రమేష్, ఆటో మల్లికార్జున్ ఫోటోగ్రాఫర్ బాబి, కొత్తపల్లి రవి, జయరాజు, బాలాజీ, దేవా, చౌగాని పాపారావు, భట్టు లచ్చిరాం, మాలంపాటి కిరణ్, శరపా పాపారావు, రాము నాయక్, జక్కుల రాము, వీరమల్లు గణేష్, గుర్రం భార్గవ్, చంటి, శశి, తదితరులు పాల్గొన్నారు.

## మోడీ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా కాంగ్రెస్ నిరసన ర్యాలీ

### నీట్ పేపర్ లీక్ ఘటనపై ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్

**అశ్వరావుపేట, జులై 23 (తెలంగాణ వాణి):**






ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు ఇతర ప్రతిపక్ష నాయకుల అరెస్టులను ఖండిస్తూ, నీట్ పరీక్ష పేపర్ లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీ నామా చేయాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురు వారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నంశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, ప్రజాస్వా మ్యాన్ని అణచివేసే కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిని తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్షాల గొంతును అరెస్టులు, వేధింపుల ద్వారా అణచివేయాలని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. నీట్ పేపర్ లీక్ ఘటనతో లక్షలాది మంది విద్యా ర్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, దీనికి పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వమే వహించాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని కోరారు. అదేవిధంగా అశ్వరావుపేట నియోజకవర్గంలోని అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, ములకలపల్లి, దమ్మపేట మండలాల్లో కూడా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజనులు, మహిళలు, విద్యార్థులు, ప్రజలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులతో పెట్టుకుంటే ప్రభుత్వ పతనం తప్పదు

### చదువులను నాశనం చేస్తున్న పాలకులు
### విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలి
### ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలి
### ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్
### కలెక్టరేట్ ముట్టడి విజయవంతం





**కొత్తగూడెం, జులై 23 (తెలంగాణ వాణి)**
రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ విమర్శించారు. విద్యార్థుల హక్కులను కాలరాస్తూ, ప్రభుత్వ విద్యను బలహీనపరిచే విధానాలను కొనసాగిస్తే విద్యార్థుల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని, విద్యార్థులతో పెట్టుకుంటే ప్రభుత్వ పతనం తప్పదు అని హెచ్చరించారు. విద్యారంగ సమస్యల సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి విజయవంతమైంది. వేలాదిమంది విద్యార్థులు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఒకానొక దశలు కలెక్టరేట్ ముక్క ద్వారా గేటును తోసుకుంటూ లోపలికి ప్రవేశించేందుకు ప్రయత్నించిన విద్యార్థులను పోలీసులు అడ్డుకున్నారు దీంతో ఏఐఎస్ఎఫ్ జండాలు పట్టుకొని పలువురు విద్యార్థులు గేట్లు ఎక్కి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ, ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ అందక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు చదువులకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ రోజురోజుకూ సంక్షోభంలోకి నెట్టబడుతోందని, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాలు, అధ్యాపకుల కొరత, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల లేమి కారణంగా నాణ్యమైన విద్య దూరమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి వెంటనే పూర్తి స్థాయి విద్యాశాఖ మంత్రిని నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యా రంగానికి దిశానిర్దేశం చేసే నాయకత్వం లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను ఆర్థికంగా దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. ఈ పరిస్థితిని అరికట్టేందుకు తెలంగాణలో ఫీజు నియంత్రణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ఫీజులపై ప్రభుత్వం కఠిన నియంత్రణ తీసుకురావాలని డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టాన్ని రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో సమర్థవంతంగా అమలు చేయాలని, పెద్ద విద్యార్థులకు ఉచితంగా 25% సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడం ప్రభుత్వ రాజ్యాంగబద్ధ బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించే వరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలు కొనసాగుతాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యా రంగాన్ని గాడిలో పెట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అజిత్ డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఏవో కృష్ణ ప్రసాద్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలోఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శిలు ఇనపల్లి పవన్ సాయి గుండల సుజన్ మాణిక్యాల వినయ్ గుగులోత్ వంశీ జిల్లా ఉపాధ్యక్షులు అక్కినపల్లి నాగేంద్రబాబు కొరిమీ సంజయ్

## విద్యార్థులకు అండగా కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుంది: ఎమ్మెల్యే జారే

### నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీపై కేంద్రాన్ని నిలదీసిన కాంగ్రెస్






**అశ్వరావుపేట, జులై 23 (తెలంగాణ వాణి):**
ప్రశ్నాపత్రాల లీకేజీలకు వ్యతిరేకంగా శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం ప్రదర్శించిన వైఖరిని నిరసిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నీట్ () సహా వివిధ పోటీ పరీక్షల్లో వరుసగా ప్రశ్నాపత్రాల లీకేజీలు చోటుచేసుకోవడంతో కోట్లాది మంది నిరుద్యోగ యువత భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీలపై శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం, వారి గొంతును అణచివేయాలని ప్రయత్నించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని మండిపడ్డారు. నీట్ అక్రమాలపై ప్రశ్నించిన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ఇతర నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. దమ్మపేటలోని వైఎస్సార్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, నిజాలను అరెస్టులతో దాచలేరు. విద్యార్థుల భవిష్యత్తు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుంది అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కక్కిరాల రమేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాక రమేష్, స్థానిక సర్పంచ్ పగడాల రమాదేవిరాంబాబు, టౌన్ అధ్యక్షుడు చిట్టిబాబు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దిశెట్టి సత్యప్రసాద్, జిల్లా మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పొదిలి జ్యోతి, మహిళా కాంగ్రెస్ బి-బ్లాక్ అధ్యక్షురాలు సున్నం లక్ష్మి, సీనియర్ నాయకులు చిన్నంశెట్టి యుగంధర్ రావు, గంగాధర్, కేవీ సత్యనారాయణ, వాసం శ్రీను, సాయిల నరసింహారావు, రమేష్ నాయుడు, గోపి, సర్పంచ్‌లు భూషణం, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, జానకిరాం, గురుమూర్తి, గ్రామ శాఖ అధ్యక్షులు, సోషల్ మీడియా కన్వీనర్లు, వార్డు సభ్యులు, యువత, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముఖ్వా విజయబాబును కలిసిన టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ నారపోగు వెంకటేశ్వర్లు

### ఆశీర్వాదం తీసుకుని కృతజ్ఞతలు తెలిపిన వెంకటేశ్వర్లు



**తల్లాడ, జులై 23 (తెలంగాణ వాణి):**
తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ శాఖ చైర్మన్ మువ్వా విజయబాబును టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్ నారపోగు వెంకటేశ్వర్లు గురువారం హైదరాబాద్‌లోని ఇరిగేషన్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్‌గా నియామకం పొందిన సందర్భంగా మువ్వా విజయబాబు వెంకటేశ్వర్లుకు శుభాకాంక్షలు తెలియజేసి స్వీట్లు తినిపించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నారపోగు వెంకటేశ్వర్లు మువ్వా విజయబాబుకు పూల బొకే అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, రాష్ట్ర వైస్ చైర్మన్‌గా తనకు బాధ్యతలు అప్పగించిన సందర్భంగా ఇరిగేషన్ శాఖ రాష్ట్ర చైర్మన్ మువ్వా విజయబాబును మర్యాదపూర్వకంగా కలిసి ఆయన ఆశీర్వాదాలు పొందినట్లు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, పార్టీ బలోపేతం కోసం నిబద్ధతతో పనిచేస్తానని పేర్కొన్నారు.

## వ్యవసాయ రంగంలో విదేశీ పెట్టుబడులను వ్యతిరేకించాలి: సీపీఎం

### - కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన




**తల్లాడ, జులై 23 (తెలంగాణ వాణి):**
వ్యవసాయ రంగంలో విదేశీ పెట్టుబడులను ప్రోత్సహిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను వ్యతిరేకిస్తూ సీపీఎం తల్లాడ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు రైతు వ్యతిరేకమని ఆరోపించారు. పత్తి, మిర్చి, ధాన్యం తదితర పంటలకు గిట్టుబాటు ధరలు లభించక రైతులు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారని అన్నారు. రైతులతో పాటు వ్యవసాయ కార్మికుల జీవనోపాధి కూడా సంక్షోభంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగంలో విదేశీ పెట్టుబడులకు అనుమతి ఇవ్వడం వల్ల దేశ ఆహార భద్రత, రైతుల స్వావలంబన దెబ్బతింటుందని పేర్కొంటూ, కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు చలమల విఠల్‌రావు, అయినాల రామలింగేశ్వరరావు, నల్లమోతు మోహన్‌రావు, పులి కృష్ణయ్య, సత్తెనపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా

### కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా





**తల్లాడ, జులై 23 (తెలంగాణ వాణి):**
తల్లాడ మండల బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ దగ్గుల రఘుపతి రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులను తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా రఘుపతి రెడ్డి స్వగృహానికి చేరుకున్న ఉప ముఖ్యమంత్రి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రఘుపతి రెడ్డి కుమారుడు శ్రీనివాసరెడ్డి, భార్య సరస్వతిని పరామర్శించిన భట్టి విక్రమార్క, ఆయన మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, సుడా చైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్య నారాయణ, మాజీ ఎమ్మెల్యే కొండవల్లి కోటేశ్వర రావు, తల్లాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగు నూరు లక్ష్మిరెడ్డి, గోవిందు శ్రీనివాసరావు, జక్కంపూడి కిషోర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

RNI NO. APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana

## నాగర్‌కర్నూల్ సర్కిల్ కార్యాలయాన్ని వార్షికంగా తనిఖీ చేసిన ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి. పాటిల్

**ఫిర్యాదులపై సత్వర స్పందన, పెండింగ్ కేసుల పరిష్కారానికి ఆదేశాలు**




**నాగర్‌కర్నూల్, జూలై 23 (తెలంగాణ వాణి):**
నాగర్‌కర్నూల్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ) డా. సంగ్రామ్ సింగ్ జి. పాటిల్ గురువారం నాగర్‌కర్నూల్ సర్కిల్ కార్యాలయాన్ని వార్షికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సర్కిల్ కార్యాలయ పరిసరాలను పరిశీలించిన ఎస్పీ, పరిశుభ్రతను ఎల్లప్పుడూ పాటించాలని సిబ్బందికి సూచించారు. ఫిర్యాదుదారులకు ప్రశాంత వాతావరణం కల్పిస్తూ ప్రతి ఫిర్యాదుపై వేగంగా స్పందించాలని, పారదర్శక విచారణ ద్వారా బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.క్రింది స్థాయి అధికారులకు అవసరమైన మార్గనిర్దేశం చేస్తూ బాధితులకు సకాలంలో సహాయం అందేలా చూడాలని సూచించారు. స్థానిక రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.రిసెప్షన్, రైటర్ విభాగం, ఇతర సిబ్బంది పనితీరును సమీక్షించిన ఎస్పీ, పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించి ఎలాంటి కేసులు పెండింగ్‌లో ఉండకుండా చర్యలు తీసుకోవాలని సీఐ అశోక్ రెడ్డిని ఆదేశించారు.సర్కిల్ కార్యాలయ నిర్వహణ, రికార్డుల భద్రత, సిబ్బంది క్రమశిక్షణపై ఎస్పీ సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ తనిఖీలో డీఎస్పీ శ్రీనివాస్, సీఐ అశోక్ రెడ్డి, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## నకిలీ డీఏపీ సూత్రధారులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలి

**మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డిరైతు సమస్యలు పరిష్కరించకపోతే భారీ ఆందోళనలు తప్పవని హెచ్చరిక**




**నాగర్‌కర్నూల్, జులై 23 (తెలంగాణ వాణి)**
నాగర్‌కర్నూల్ జిల్లాలో నకిలీ డీఏపీ ఎరువుల వ్యవహారంలో సూత్రధారులపై పీడీ యాక్ట్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి డిమాండ్ చేశారు.గురువారం ఆయన మాట్లాడుతూ, రైతులతో రాజకీయాలు చేయకుండా వారి సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. కరువు, ఎరువుల కొరత, ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. నకిలీ డీఏపీ దందాలో ఉన్న దళారులను స్థానిక ఎమ్మెల్యే కాపాడుతున్నారని విమర్శిస్తూ, ఈ వ్యవహారంలో అక్రమంగా సంపాదించిన లాభాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.నకిలీ డీఏపీ వ్యవహారంపై నెల రోజుల్లో న్యాయం చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించిన ఆయన, రైతులను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, సమస్యలను ప్రశ్నించే వారిపై కేసులు నమోదు చేయడం మానుకోవాలని అన్నారు.మొక్కజొన్న కొనుగోళ్లు, గన్నీ బ్యాగుల సరఫరా, రవాణా చెల్లింపుల్లో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. గన్నీ బ్యాగుల కృత్రిమ కొరత సృష్టించి రైతులను దోచుకున్నారని, సబ్సిడీ సొమ్ము రైతుల ఖాతాల్లో జమ కాలేదని విమర్శించారు. హమాలీ, రవాణా పేరుతో రైతుల నుంచి అక్రమ వసూళ్లు చేస్తున్నారని, ట్రక్ షీట్లలో నమోదైన బ్యాగుల సంఖ్యకు అనుగుణంగా రైతులకు చెల్లింపులు జరగడం లేదని అన్నారు. వరి, మొక్కజొన్న రవాణా బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.బిజినపల్లిలో రైతులను మోసం చేసిన ప్రైవేట్ దళారులపై చర్యలు తీసుకోవాలని, రైతు సమస్యలపై ఆధారాలతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.తెలంగాణ నీటి హక్కులను కాంగ్రెస్ ప్రభుత్వం కాపాడలేకపోయిందని ఆరోపించిన మర్రి జనార్దన్ రెడ్డి, కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను ఆంధ్రప్రదేశ్‌కు వదిలేశారని విమర్శించారు. కల్వకుర్తి ఆయకట్టుకు క్రాప్ హాలిడే ప్రకటించడం రైతులను మోసం చేయడమేనని పేర్కొన్నారు. వరదలు వచ్చిన వెంటనే నార్లాపూర్, కల్వకుర్తి లిఫ్ట్ పంపులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే కలెక్టరేట్ ఎదుట వంటావార్పు, భారీ నిరసన కార్యక్రమాలు చేపడతామని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి హెచ్చరించారు.

## నీట్ పేపర్ లీకేజీ, ప్రతిపక్ష నేతల అరెస్టులకు నిరసనగా కాంగ్రెస్ ఆందోళన

**మోదీ, అమిత్ షా, ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మల దహనం**



**ఉప్పునుంతల, జూలై 23:**
ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు గురువారం ఉప్పునుంతల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.నీట్ పేపర్ లీకేజీ ఘటనతో పాటు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తదితర కాంగ్రెస్ నాయకుల అరెస్టులను నిరసిస్తూ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు.ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కర్నె లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీ అరుణ నరసింహారెడ్డి, ఎస్సీ సెల్ నాయకుడు, సర్పంచ్ చింగాల్ల శ్రీనివాసులు, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మెడమోని భాస్కర్, యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జి అంతటి శేఖర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రత్లవాత్ కృష్ణ, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేటీఆర్ జన్మదినం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు

**- శిబిరాన్ని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు**



**అశ్వరావుపేట, జూలై 23 (తెలంగాణ వాణి)**
తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని అశ్వరావుపేట మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని వైరా మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లుతో కలిసి అశ్వరావుపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు గురువారం ప్రారంభించారు.డా. భూక్యా ఉదయజ్యోతిడా. భూక్యా ప్రసాద్ దంపతులు, కాసాని నాగశేష పద్మచంద్రమోహన్ దంపతుల ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులను మెచ్చా నాగేశ్వరరావు అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందడంతో పాటు వైద్య ఖర్చుల భారం తగ్గుతుందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమానికి ఎల్లప్పుడూ కేటీఆర్ ప్రాధాన్యత ఇస్తారని, ఆయన స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ప్రజల ఆశీస్సులతో కేటీఆర్ మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో మహిపాల్, సీతారామస్వామిరావు, జోగేశ్వరరావు, జూపల్లి రమణారావు, మందపాటి రాజమోహన్ రెడ్డి, బిర్రం వెంకటేశ్వరరావు, సంక ప్రసాద్, చిన్నంశెట్టి నరసింహం, చందా లక్ష్మీనర్సయ్య, గూడవర్తి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు నారం రాజశేఖర్, సాధు జ్యోత్స్న, బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు సత్యవరపు సంపూర్ణ, శెట్టిపల్లి రఘురాం, ఆరేపల్లి గోవింద్, మోటూరి మోహన్, పానుగంటి లక్ష్మణ్‌రావు, రెడ్డి మల్లనాగయ్య, బోలికొండ చెన్నారావు, ఉమ్మల శ్రీనివాస్ రెడ్డి, కునుసోత్ నవీన్, శ్రీను, అప్పారావు, ఏసు, గంగాధర్, తగరం హరి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలి

**విద్యార్థుల సంఖ్య పెంచాలి:**

**డీఈఓ రమేష్ కుమార్**

**తెల్కపల్లి, లింగాల మండలాల్లో పాఠశాలల ఆకస్మిక తనిఖీ**



**నాగర్‌కర్నూల్, జూలై 23 (తెలంగాణ వాణి)**
ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడంతో పాటు విద్యార్థుల సంఖ్య పెరిగేలా కృషి చేయడం ఉపాధ్యాయుల ప్రధాన బాధ్యత అని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) రమేష్ కుమార్ అన్నారు. విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించేలా బోధన సాగించాలని, విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.గురువారం ఆయన నాగర్‌కర్నూల్ జిల్లాలోని తెల్కపల్లి, లింగాల మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించి విద్యా బోధన, విద్యార్థుల అభ్యాసన స్థాయిలు, హాజరు, మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు తదితర అంశాలను పరిశీలించారు. తరగతి గదులను సందర్శించి బోధనా విధానాన్ని పరిశీలించడంతో పాటు




విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించారు.తెల్కపల్లి మండలంలోని గౌరెడ్డిపల్లి ఎంపీపీఎస్, లింగాల మండలంలోని మక్దూంపూర్ ఎంపీపీఎస్, లింగాల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ), అప్పాయిపల్లి ఎంపీయూపీఎస్‌లను ఆయన సందర్శించారు. ప్రతి పాఠశాలలో బోధనా విధానాలపై ఉపాధ్యాయులకు సూచనలు చేస్తూ, విద్యార్థులు పాఠ్యాంశాలను కేవలం చదవడం కాకుండా అర్థం చేసుకుని ఆచరణలో వినియోగించే స్థాయికి చేరేలా బోధన ఉండాలని సూచించారు.విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంచేందుకు వినూత్న బోధనా పద్ధతులను అనుసరించాలని, ప్రతి విద్యార్థి అభ్యాసన స్థాయిని నిరంతరం అంచనా వేస్తూ వెనుకబడిన వారికి ప్రత్యేక శిక్షణ అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అప్పాయిపల్లి ఎంపీయూపీఎస్‌లో విద్యార్థుల నమోదు పెంపుతో పాటు నాణ్యమైన బోధన అందిస్తున్న ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో విశ్వాసాన్ని పెంపొందించేలా ప్రతి ఉపాధ్యాయుడు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.పాఠశాలల పనితీరును నిరంతరం సమీక్షిస్తూ అవసరమైన మార్పులు చేపడతామని, విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా విద్యా ప్రమాణాల పెంపుదలలో ఎలాంటి రాజీ ఉండదని డీఈఓ రమేష్ కుమార్ స్పష్టం చేశారు.ఈ తనిఖీలలో జిల్లా విద్యాశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ సుజాత, ఏఎంఓ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యలపై కేంద్రానికి వ్యతిరేకంగా నిరసన



**అచ్చంపేట జులై 23 (తెలంగాణ వాణి)**
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని లింగాలలో కాంగ్రెస్ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ, రంగినేని శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు పట్టణ సర్పంచ్ పూజారి ఈశ్వరమ్మబుడ్డయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు. నీట్ పరీక్ష అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు.